క్లుప్తంగా

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి శివారులో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బోయినపల్లి కార్యదర్శి బదిలీ

బోయినపల్లి: బోయినపల్లి పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను అనంతపల్లి గ్రామానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంపీవో శ్రీధర్ శుక్రవారం తెలిపారు. బోయినపల్లి పంచాయతీ కార్యదర్శిగా అనంతపల్లి పంచాయతీ కార్యదర్శి అనిల్ నియమితులయ్యారని పేర్కొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకుంటారా..



మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్, బీజేపీలు పని చేస్తున్నాయని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటరీ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి కారణాలు లేకుండానే వేములవాడ బంద్‌కు పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. మాజీ జెడ్పీటీసీ మెరుగు యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్నేని అంజన్‌రావు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కిషన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాళ్లు కడిగించడం అవమానకరం'

ఎల్లారెడ్డిపేట: విదేశీ సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడం అవమానకరమని మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు ఇల్లందుల గీతాంజలి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: జిల్లాలో కాంగ్రెస్ మంత్రుల పర్యటన ఉన్నందున అడ్డుకుంటారనే అనుమానంతో పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, పలువురు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ చేరుకొని సంఘీభావం తెలిపారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న వెంకటేశ్

ముస్తాబాద్: బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వరి వెంకటేశ్ అత్యవసర పరిస్థితుల్లో ఓ పేషంట్‌కు రక్తదానం చేశాడు. సిద్దిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్‌కు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. స్పందించిన వెంకటేశ్ వెంటనే రక్తదానం చేశారు. ఇప్పటివరకు పదిహేనుసార్లు రక్తదానం చేసినట్లు వెంకటేశ్ తెలిపారు.

ప్రాచీన కళలను ఆదరించాలి



వికాస్‌రావును ఆహ్వానిస్తున్న కళాకారులు

కోనరావుపేట: గ్రామాల్లో అంతరించిపోతున్న ప్రాచీన కళలను ఆదరించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. రామన్నపేటలో ఈనెల 19, 20, 21ల్లో చిడతల రామాయణం నాటక ప్రదర్శన సందర్భంగా కళాకారులతో మాట్లాడారు. ప్రాచీన కళలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే కళాకారులకు సామగ్రి అందించామన్నారు. గ్రామంలో జరిగే నాటక ప్రదర్శనకు హాజరు కావాలని కళాకారులు కోరారు.



ఈ చిత్రం వెంకటాపూర్ శివారులోని అతి ప్రమాదకరమైన మలుపు. వారంలో రెండు, మూడు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఈ మలుపును ప్రయాణికులు డేంజర్ స్పాట్‌గా భావిస్తారు. రెండు సంఘటనల్లో ఇద్దరు మరణించిన సందర్భాలున్నాయి. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న ఈ మలుపు వద్ద కనీసం హెచ్చరిక బోర్డుల్లేవు. ఈ రహదారి వెంట ఉన్న మలుపులతోపాటు సిరిసిల్ల–కరీంనగర్ రహదారిపై కూడా కనీస రక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

డేంజర్ స్పాట్స్..

- యమపాశాలుగా మలుపులు
- అతివేగం.. అజాగ్రత్తతో ప్రమాదాలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- కనిపించని హెచ్చరిక బోర్డులు



సర్దాపూర్ శివారులో ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు



రాగట్లపల్లి శివారులో మలుపు

ఎల్లారెడ్డిపేట: డేంజర్ రోడ్లతో ప్రమాద రూపంలో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా మలుపులు మృత్యుకుహరాలుగా మారాయి. దీనికితోడు అతి వేగం, అజాగ్రత్తతో జరుగుతున్న ప్రమాదాలతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగంతో ఇసుక రవాణా వాహనాలు, భారీ వాహనాలతో ఇటీవల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అతి ప్రమాదకరమైన మలుపుల వద్ద అధికారులు కనీసం రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి వస్తాడనే గ్యారంటీ లేకుండా పోతోంది. కుటుంబ పెద్దల మరణాలతో ఆ కుటుంబాలన్నీ చిన్నాభిన్నమవుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలో నెల రోజుల వ్యవధిలో 18 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ముగ్గురు చనిపోగా.. 10 మంది గాయపడ్డారు. ఇందులో ఐదు ప్రమాదాలు ఇసుక ట్రాక్టర్లతోనే జరగడం గమనించాల్సిన విషయం. మండలంలో ఏదో ఒక మూల వాహనాలు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నాయి.

ప్రమాదకర మలుపులివే..

- రాచర్లగొల్లపల్లి, రాగట్లపల్లి, వెంకటాపూర్, పెద్దూరు, సర్దాపూర్, సిరిసిల్ల బైపాస్, చంద్రంపేట ఎక్స్‌రోడ్డు, వేములవాడ కమాన్, నాంపల్లిగుట్ట, కొదురుపాక, వెంకట్రావుపల్లి మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.
- అంతర్గత రహదారుల్లో కంచర్ల, వీర్నపల్లి సబ్‌స్టేషన్లు, ముస్తాబాద్ శివారులో రెండుచోట్ల, ఎల్లారెడ్డిపేట బైపాస్ రోడ్డు ప్రమాదకరం.
- వెంకటాపూర్ గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న జంక్షన్‌తోపాటు నాలుగుచోట్ల మలుపులు అతి ప్రమాదకరంగా మారాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.
- ఈ మార్గాల్లో ఎక్కడ కూడా హెచ్చరిక బోర్డులు పెట్టలేదు. ఎలాంటి రక్షణ చర్యలు అధికారులు తీసుకోలేదు.

నెల రోజుల్లో 18 ప్రమాదాలు

మండలంలో నెల రోజుల వ్యవధిలో 18 రోడ్డు ప్రమాదాలు జరగగా.. ఐదుగురు మరణించారు. 10 మంది గాయాలతో బయటపడ్డారు. కొన్ని ప్రమాదాల్లో ప్రాణాలు పోతే తప్పా పోలీసుల దృష్టికి వచ్చే అవకాశాలుండవు. నెల వ్యవధిలో ఇసుక ట్రాక్టర్లతోనే ఐదు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వివిధ పనులరీత్యా బయటకు వెళ్తున్న వారు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడంతో బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఐదుగురు ఒకే నెలలో రోడ్డు ప్రమాదాల్లో మరణించగా.. బతుకు బండిని నడిపించాల్సిన కుటుంబ పెద్ద మరణంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలతోపాటు రోడ్డు రవాణా శాఖ అధికారులు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రజల విలువైన ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పట్టించుకోని అధికారులు



అతి ప్రమాదకరమైన మలుపులున్నచోట అధికారులు కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తే రాత్రిపూట సులువుగా గుర్తు పట్టే అవకాశముంటుంది. కొత్తవారు ప్రయాణించినప్పుడు మలుపులు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలి.

– పొన్నాల తిరుపతిరెడ్డి, వెంకటాపూర్

అతివేగంతోనే ప్రమాదాలు



మద్యం తాగి అతివేగంగా వాహనాలు నడపడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ డంకెన్ డ్రైవ్ ప్రతిరోజూ నిర్వహిస్తోంది. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖకు విన్నవించాం. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను తగ్గించొచ్చు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

– శ్రీనివాస్, సీఐ, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్ గ్రామ శివారులో రోడ్డుకిరువైపులా సైడ్‌వాల్స్ నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి పక్కనే ఎలాంటి రక్షణ లేకుండా లోతుగా పెద్ద గుంతలుండడంతో.. కొత్తగా ఈ రోడ్డు వెంట ప్రయాణాలు చేసేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలౌతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జాఫర్, పంచాయతీ కార్యదర్శి, నారాయణపూర్, సెల్ నంబర్: 9640832448

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

చౌడాలమ్మ కల్యాణ వేడుకలు



పాల్గొన్న విప్ ఆది తదితరులు

కోనరావుపేట: నిమ్మపల్లి(గొల్లపల్లి)లో చౌడాలమ్మ కల్యాణ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. షేక్ ఫిరోజ్ పాషా, మల్యాల దేవయ్య, ఎల్లయ్య, ప్రభాకర్, దేవరకొండ తిరుపతి, బండ నర్సయ్య, రాఘవరెడ్డి, చంద్రయ్యగౌడ్, దేవయ్య, కదిరే శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, దొంతరవేణి శ్రీనివాస్ తదితరులున్నారు.

భూమాతకు బూరెల నైవేద్యం



తడగొండలో ఇంటి ఎదుట బూరెలు నైవేద్యంగా పెడుతున్న మహిళ

బోయినపల్లి: భూమాత శాంతించాలని వేడుకుంటూ తడగొండ గ్రామంలో పలువురు మహిళలు శుక్రవారం భూమాతకు బూరెల నైవేద్యం సమర్పించారు. ఇటీవల భూమి కంపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భూమాత శాంతించాలని ప్రార్థిస్తూ ఇంటి ఎదుట చిన్న గుంత తీసి అందులో పసుపు, కుంకుమతో ముగ్గులు వేసి బూరెలు నైవేద్యాలుగా పెట్టి పూజలు చేశారు. మహిళలు ఒకరికొకరు పసుపు, కుంకుమలు పెట్టుకున్నారు. పూర్వపు రోజుల్లో భూమి కంపించినపుడు తమ పూర్వీకులు భూమాతకు బూరెలు నైవేద్యాలుగా పెట్టేవారని, అందుకే తాము భూదేవి శాంతించాలని బూరెలు నైవేద్యాలుగా పెట్టామని గ్రామానికి చెందిన సింగరి రాజేశ్వరి తెలిపారు.

గాయత్రి ఆశ్రమంలో పూజలు



తంగళ్లపల్లి: బద్దెనపల్లి గాయత్రి ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం నిర్వహించగా.. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆశ్రమ నిర్వాహకుడు బాదం ప్రకాశ్ పాల్గొన్నారు.

కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం అన్ని పార్టీల నాయకులు సన్మానించారు. రిటైర్డ్ ఆర్‌ఐబీ అదనపు కార్యదర్శి తుమ్మ రామస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకుడు మోర రాజు, తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్, ఆదర్శ యూత్ క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



బల్దియా.. ఇదేందయా..?

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ తీరుపై శ్రీనగర్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్ నుంచి చంద్రంపేటకు వెళ్లే 60 ఫీట్ల రహదారి పక్కనే గల మురుగు గుంత నుంచి సిల్టును తీసి రోడ్డుపై పోయడంతో విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా ఇలాగే జరగడంతో చాలాసార్లు అధికారులు చుట్టూ తిరిగి వేసారిపోయామన్నారు. ఇప్పుడు కూడా మురుగు కూపం నుంచి సిల్టును ఇలా పోయడంతో దుర్గంధంతో కాలనీవాసులు, రోడ్డు వెంట వెళ్లేవారి ముక్కులు అదురుతున్నాయన్నారు. తీసిన సిల్టును వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

కోనరావుపేట వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టాతో సంయుక్త

కోనరావుపేట: మండల కేంద్రానికి చెందిన మెట్టు సంయుక్త ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. సంయుక్త ప్రొఫెసర్ అశోక్ పర్యవేక్షణలో 60 ఏళ్లుగా దళిత మహిళ, కులం, లింగ అణచివేత నుంచి ప్రతిఘటిస్తూ ఎలా విముక్తి చెందారంటే అది చదువుకోవడం వల్లే అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం డాక్టరేట్ అందజేసింది.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గాలిపెల్లిలో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: గాలిపెల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సుధగోని శ్రీకాంత్‌గౌడ్ ప్రారంభించారు. ఎస్సీకాలనీలోని 7వ వార్డులో ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులు రూ.5లక్షలతో పనులు ప్రారంభించారు. గజ్జల శ్రీనివాస్, కోమటిరెడ్డి శ్రీనివాస్, అరుణ్, సుధగోని నారాయణగౌడ్, వినోద్, కిరణ్, సాయి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మంగళ్లపల్లి గ్రామ బీటీ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను గ్రామ నాయకులు బాదినేని బాలరాజు, శేఖర్, దేవయ్య తదితరులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో నిధులు మంజూరైనట్లు తెలిపారు. మొగిలిపాలెం మల్లయ్య, పర్శరాములు తదితరులున్నారు.

స్కూటీ, కారు ఢీ

- ఒకరిపై ఒకరు పరస్పర దాడి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక స్థానిక బస్టాండ్ సమీపంలో ఆగి ఉన్న కారును ఒకరు స్కూటీతో ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఒకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. తన కారును ఢీకొట్టాడన్న ఆగ్రహంతో కారు డ్రైవర్ స్కూటీని ధ్వంసం చేసే ప్రయత్నం చేశాడు. కాగా ఇరువురు పరస్పరం దాడి చేసుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.



భానుడి కనువిందు

సిరిసిల్లటౌన్: నీలాకాశంలో సూర్యుడు కనువిందు చేశాడు. శుక్రవారం ఉదయం వేళలో సిరిసిల్లపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉదయం 11 గంటల తర్వాత మబ్బుల చాటు నుంచి సూరీడు ఇలా బయటకు వస్తూ కనువిందు చేశాడు. ఎండాకాలంలో నిప్పులు చెరిగే సూరీడు కారుమబ్బులు చీలుస్తూ.. వినీలాకాశంలో బయటకు వస్తూ.. చుట్టు కాంతి వలయం ఏర్పడటం పట్టణ వాసులను సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తింది.

సర్కారు బడిలో నాణ్యమైన విద్య



ప్రచారం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు లక్ష్మినారాయణ


వేములవాడ: సర్కారు బడిలో సకల సౌకర్యాలుంటాయని, మంచి విద్యాబోధన జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మినారాయణ శుక్రవారం విద్యార్థులతో కలిసి పట్టణంలోని న్యూఅర్బన్‌కాలనీ వీధుల్లో ప్రచారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్త విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: విద్యార్థులను అన్ని వసతులు కలిగి ఉచితంగా విద్యనందించే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఓబులాపూర్ పాఠశాల హెచ్ఎం బండి ఉపేందర్ అన్నారు. శుక్రవారం గ్రామంలోని ఉపాధిహామీ పనుల వద్ద కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో కల్పించే సౌకర్యాలు, విద్యాబోధనపై వివరించారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రఘువీరారెడ్డి, ఉపాధిహామీ కూలీలు, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని హెచ్ఎం ఎల్లమ్మల లక్ష్మణ్ కోరారు. ముస్తాబాద్ అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుడు అంజాగౌడ్, నాయకులు ముక్క మల్లయ్య, కృష్ణమూర్తి, తలారి నర్సయ్య, రాజు, అశోక్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: గంభీరావుపేట మండలం గజసింగవరంలో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శీలం సోమయ్య పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపైకి విస్తరించిన ముళ్లపొదలు

ఇల్లంతకుంట: జిల్లాకు ఇల్లంతకుంట నుంచి అనంతారం మీదుగా వెళ్లే మార్గంలో బిక్క వాగుపై అసంపూర్తి హైలెవెల్ వంతెన వద్ద మలుపు అతి ప్రమాదకరంగా ఉంది. ఇల్లంతకుంట నుంచి వెళ్లే వారికి మలుపు వద్ద ముళ్ల చెట్లు రోడ్డుపైకి విస్తరించి అవతల నుంచి వచ్చే వాహనాలు కనబడడం లేదు. దగ్గరకు వచ్చేవరకు తెలియడం లేదని వాహనదారులంటున్నారు. ముళ్ల చెట్లకు పది మీటర్ల దూరంలోనే అసంపూర్తి బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. అసంపూర్తి వంతెనకు సైడ్ వాల్స్ కట్టలేదని, పడితే మరణమేనంటున్నారు వాహనదారులు.

ముళ్ల చెట్లు కొట్టెయ్యాలి



రోడ్డుపైకి తుమ్మ చెట్లు విస్తరించి ఉన్నాయి. మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనం దగ్గరికి వచ్చేవరకు కనబడదు. అన్ని రోడ్లపై అక్కడక్కడ ఇలా ఉన్నాయి. ఉపాధి కార్మికులతో ఇలాంటివి కొట్టించాలి. గతంలో ఈవిధంగా చేశారు.

– టి.రామలింగారెడ్డి, జంగారెడ్డిపల్లె

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అనిల్

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో చేపట్టిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం కార్వింగ్ షో నిర్వహించారు. కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్‌కుమార్ పుచ్చకాయపై కార్వింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో మాట్లాడుతూ.. డ్రాయింగ్, యోగా, కంప్యూటర్, గేమ్స్ లాంటి వాటిలో రాణిస్తున్నారన్నారు. ప్రధానోపాధ్యాయుడు మనోహరాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.